నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 19 ఆగస్టు 2024 | RANGAREDDY



సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

## పాపన్నగౌడ్ పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు

రంగారెడ్డి, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ) : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట పటిమ అందరికీ స్ఫూర్తిదాయకమని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ శశాంక పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అన్యాయాన్ని ఎదిరించి చూపిన పోరాట తెగువ అనన్య సామాన్యమైనదని కొనియాడారు. రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న ఆ రోజుల్లో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ఓ సాధారణ వ్యక్తి కుల వృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ అసమాన ధైర్య సాహసాలతో పోరాటం చేశారని పేర్కొన్నారు. నాటి దౌర్జన్యాలను ఎండగడుతూ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను సైతం జయించి, జనరంజకంగా పాలన సాగించారని అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని, ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, బీసీ సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలను అనుమతించొద్దు

**ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి**

**ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్**

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 18: హబ్సిగూడలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిన బాలిక కుటుంబంతో పాటు తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమురెల్లి బాబు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలు నగరంలోకి అనుమతించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. నో ఎంట్రీ సమయంలో భారీ వాహనాలను అనుమతించకూడదని కోరారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి చేస్తున్నారే తప్ప..పూర్తిస్థాయిలో నియంత్రించడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు జోగు రాములు, శ్రీహరి, హుస్సేన్, శివ, రవికాంత్, వెంకట్‌గౌడ్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ నాయకులు

## మట్టి గణపతి.. గట్టి సంకల్పం..

**ఈ సారి 5 లక్షల విగ్రహాల పంపిణీ**

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ ) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది 5 లక్షల మట్టి విగ్రహాలను జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పీసీబీ శాఖలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాయి. మట్టి గణపతులనే పూజిద్దామంటూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ వంతు బాధ్యతగా ఉచితంగా 8 అంగుళాల పొడవుతో కూడిన మట్టి విగ్రహాలను అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు 8 ఇంచులు, ఒక అడుగు, 1.5 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహాల తయారీకి టెండర్లను ఆహ్వానించేందుకు కసరత్తును పూర్తి చేశారు. ఈ నెలాఖరులోగా ఆ ప్రక్రియను పూర్తి చేసి.. వచ్చే నెల మొదటి వారంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. జీహెచ్ఎంసీ మూడు లక్షలు, పీసీబీ, హెచ్ఎండీఏ లక్ష విగ్రహాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు 5 లక్షల మట్టి విగ్రహాల తయారీకి ప్రభుత్వం ఆయా శాఖల నుంచి రూ. 2.50 కోట్లు ఖర్చు చేయనున్నది.

## మాఫీ అంటే సంతోషపడ్డా..



రుణమాఫీ అయితుందంటే ఎంతో సంతోషపడ్డా. చేవెళ్లలోని ఎస్‌బీఐలో రూ.98,400 పంట రుణం తీసుకున్న. కానీ నాకు రుణమాఫీ కాలె. అధికారుల చుట్టూ రోజూ తిరుగుతున్నా. వడ్డీకి డబ్బులు తెచ్చి సాగు చేసినా. కాంగ్రెసోళ్ల మాయ మాటలు నమ్మి మోసపోయినం.


– మక్బూల్, చేవెళ్ల గ్రామం, రంగారెడ్డి జిల్లా

## మూడో విడుతలోనూ మాఫీ కాలె..



మూడో విడుతలోనూ రుణమాఫీ కాలె. చేవెళ్లలోని డీసీసీబీ బ్యాంకులో రూ.35 వేల రుణం తీసుకున్నా. అధికారులను అడిగితే వెయిట్ చెయ్యండి అంటూ దాటవేస్తున్నారు. కాంగ్రెసోళ్ల మాయమాటలు నమ్మి మోసపోయినం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు కొంచమైనా బాధ కలుగలె. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ సవాలక్ష కొర్రీలు పెట్టి రైతుల ఉసురు పోసుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు చెప్పి రైతులు, ప్రజలను మోసం చేస్తున్నది.

– కొల్లగల్ల స్వర్ణలత, ఈర్లపల్లి గ్రామం, చేవెళ్ల మండలం, రంగారెడ్డి జిల్లా



### రుణమాఫీకి పెద్ద సంఖ్యలో రైతులు దూరం

- రంగారెడ్డి జిల్లాలో మూడు విడుతల్లో 87,612 మంది రైతులకు రూ.660.72కోట్లు మాఫీ
- రూ.2లక్షలు మాఫీ కేవలం 15,226 మంది రైతులకే..
- వికారాబాద్ జిల్లాలోనూ కొందరికే అందిన రుణమాఫీ
- అధికారులకు ఫిర్యాదు చేసినా.. పరిష్కారం అంతంతే !

# మేం అర్హులం కాదా?

రంగారెడ్డి, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : అందరికీ రుణమాఫీ చేశామని ఓ పక్క కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుండగా.. మాకు మాఫీ వర్తించలేదు మహాప్రభో! అంటూ రైతాంగం గగ్గోలు పెడుతున్నది. మొదటి, రెండు విడుతల్లోనూ పేరు రాని రైతులు మూడో విడుత జాబితా కోసం ఎదురుచూశారు. మూడో జాబితాలోనూ పేర్లు లేకపోవడంతో.. మేం రైతులం కాదా? మాకెందుకు మాఫీ కాలేదు? అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌కు, మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి రైతుల నుంచి ఫిర్యాదులు పోటెత్తుతున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం వెల్లడించిన జాబితాలో కనీసం మూడో వంతు మందికి కూడా మాఫీ జరుగకపోవడంతో జిల్లా రైతాంగం ఆందోళన చెందుతున్నది.

### ఆంక్షల పేరిట మంగళం..

రంగారెడ్డి జిల్లాలో మొదటి విడుతలో 49,471 మందికి రూ.257.19 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. రెండో విడుతలో 22,915 మంది రైతులకు సంబంధించిన రూ.218.13 కోట్లను, మూడో విడుతలో 15,226 మంది రైతులకు రూ.185.40కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. మూడు విడుతల్లో కలిపి జిల్లాలో 87,612 మందికి రూ.660.72కోట్లను మాత్రమే మాఫీ చేసింది. అర్హులు లక్షల్లో ఉండగా.. కేవలం వేలల్లోనే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నది. రేషన్‌కార్డులేక కుటుంబ నిర్ధారణ కాకపోవడం, పట్టాపాసుబుక్ లేకపోవడం, ఆధార్ కార్డుకు లోన్ ఖాతాకు పేరులో తేడా ఉండడం, సొసైటీలు, బ్యాంకుల్లో జరిగిన తప్పులతో వేల మంది రుణమాఫీకి దూరమయ్యారు. మూడో జాబితాపై ఆశలు పెట్టుకున్న వారిపైననూ ప్రభుత్వం నీళ్లు చల్లింది. ప్రభుత్వం ప్రకటించిన అన్ని అర్హతలు ఉన్నవారికి సైతం రుణ మాఫీ కాలేదు. తెల్ల రేషన్ కార్డు ఉన్నా.. కుటుంబంలో ఒక్కరే రుణం తీసుకున్నా.. పట్టాపాస్ పుస్తకం ఉన్నా.. ఆధార్ కార్డు, బ్యాంకు బుక్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉన్నప్పటికీ రూ.2లక్షల్లోపు రుణమాఫీ వర్తించలేదని రైతులు వాపోతున్నారు. రుణమాఫీ పోర్టల్‌లో పరిశీలిస్తే.. టు బీ ప్రాసెస్ అని వస్తున్నదని రైతులు చెబుతున్నారు.

### నమ్మశక్యంగాలేని అధికారుల మాటలు..

రూ.2లక్షల లోపే రుణం తీసుకున్నప్పటికీ జాబితాలో పేర్లు లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయం, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అధికారులు రుణమాఫీ పోర్టల్‌లో పరిశీలించి వివరాలు వెల్లడిస్తున్నప్పటికీ.. స్పష్టత రావడం లేదు. గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకుంటే అర్హులందరికీ మాఫీ అవుతుందని ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నా.. రైతుల్లో నమ్మకం కలుగడం లేదు.

### సొసైటీల్లోని రైతులకు మొండి చెయ్యి..

పీఏసీఎస్‌లో రూ.2లక్షలు రుణాలు తీసుకున్న రైతులకు మూడో జాబితాలోనూ ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది. మొదటి, రెండో విడుతల్లో పేర్లు రాక.. మూడో విడుతపై ఆశలు పెట్టుకున్న రైతులకు భంగపాటే మిగిలింది. నందిగామ పీఏసీఎస్‌లో రూ.2లక్షల రుణాలను 44 మంది రైతులు తీసుకుంటే కేవలం 18 మందికి మాత్రమే మాఫీ అయింది. 26 మందికి కాలేదు. మేకగూడ పీఏసీఎస్‌లో 38 మంది రైతులు రుణాలు తీసుకుంటే 241 మందికే మాఫీ కాగా.. 139 మంది రుణ విముక్తి కలుగలేదు. చేగూర్ పీఏసీఎస్‌లో 349 మంది రైతులకుగాను 236 మందికే మాఫీని వర్తింపజేశారు. ఇంకా 113 మంది రుణమాఫీకి దూరంగానే ఉన్నారు.

### అధికారుల చుట్టూ తిరుగుతున్నా..



నా పేరుపైన రెండు ఎకరాల భూమి ఉన్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాలె. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అన్ని కల్లబొల్లి మాటలే. నేను చేగూరు పీఏసీఎస్‌లో రూ.58,000 పంట రుణం తీసుకున్నా. మూడో విడుతలోనూ మాఫీ కాలె. అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు.

– బంట్రుపు చెన్నమ్మ, ఈదులపల్లి, నందిగామ

### వికారాబాద్ జిల్లాలో..

పరిగి : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షలు రుణమాఫీ అంటూ ఆచరణకు అమలు కానీ హామీలిచ్చి ఇప్పుడు తీరా కొందరికే రుణమాఫీ చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్.. అనేక కొర్రీలు పెడుతున్నదని జిల్లావాసులు మండిపడుతున్నారు. పరిగి మండలం రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 405 మంది రైతులు ఉన్నారు. వారిలో 200 మందికి పైగానే వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందారు. గత ఐదేండ్ల కాలంలో రుణం పొందిన వారికి రూ.2లక్షలు రుణమాఫీ అవుతుందని ఆశించారు. కానీ అరకొర మాఫీతో రైతులు పెదవి విరుస్తున్నారు. రంగాపూర్ పరిధిలో మొదటి విడుతలో లక్ష లోపు రుణం ఉన్న 60 మంది రైతులకు రూ.43,48,950 మాఫీ జరిగింది. రెండో విడుతలో 42 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. ఆగస్టు 15న మూడో విడుతలో ఎంతమందికి మాఫీ అయ్యిందో స్పష్టతలేదు. బ్యాంకు వారు తీసుకున్న వివరాలు కరెక్టుగా ఉన్నా పేరు మిస్‌మ్యాచ్ అని, రేషన్ కార్డులో ఒకే కుటుంబం వారు ఉన్నారన్న తదితర కారణాలు చెబుతూ రుణమాఫీ కాలేదంటూ బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. కొందరికి రుణమాఫీ జరిగినట్లు మెసేజ్‌లు వచ్చినా డబ్బులు అందలేదు. ఒకే రేషన్‌కార్డులో తండ్రి, కొడుకుల పేర్లు ఉండి, వారు వేర్వేరు కాపురంగా ఉంటున్నా వారికీ రుణమాఫీ కాలేదు. వాణిజ్య పంటలు పండించే రైతులకు మాఫీ చేయలేదు. తమకు ఎంత రుణం ఉన్నదన్నది కాకుండా ప్రభుత్వం ఇచ్చే రూ.2లక్షలు మాఫీ అందరికీ వర్తింపజేయాలని, మిగతా డబ్బులు తాము చెల్లించుకుంటామని రైతాంగం పేర్కొంటున్నది.

### ఒకే రేషన్‌కార్డు ఉన్నదని మాఫీ కాలె..



నా పేరిట 7.11 ఎకరాలు భూమి ఉండగా, పరిగిలోని ఎస్‌బీఐలో రూ.1.50లక్షలు రుణం తీసుకున్నా. నా కుమారుడు లావుడ్య నరేశ్ పేరిట 2 ఎకరాల భూమి ఉండగా రూ.80వేలు రుణం తీసుకున్నాడు. మాకు ఒకే రేషన్ కార్డు ఉండడంతో రుణమాఫీ కాలేదు.

–లావుడ్యా విజయ్, రంగాపూర్‌తండా, పరిగి మండలం

### అధికారులు మాట దాటవేస్తుండ్రు..



నాకు, మా నాయన బాలయ్యకు రుణమాఫీ కాలేదు. పరిగిలోని ఎస్‌బీఐలో రుణం తీసుకున్నా. మాకు ఒకే రేషన్‌కార్డు ఉన్నదన్న కారణంగా రుణమాఫీ చేయలేదు. వ్యవసాయాధికారులను అడిగితే మాట దాటవేస్తుండ్రు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్నది. రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదు.

– చాకలి వెంకటయ్య, రంగాపూర్, పరిగి మండలం

# అక్రమ నిర్మాణాలపై.. హైడ్రా ఉక్కుపాదం

- గండిపేట జలాశయంలో ఎఫ్‌టీఎల్ నిర్మాణాలు
- భారీ పోలీసు బలగాల మధ్య అక్రమ నిర్మాణాలను కూల్చిన హైడ్రా అధికారులు

మొయినాబాద్, ఆగస్టు 18 : నగరానికి తాగునీరు అందించే గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్‌లో అడ్డగోలుగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం రూపొందించిన హైడ్రా ఉక్కుపాదం మోపుతున్నది. నిర్మాణాలు చేపడుతున్న వారు ఏ స్థాయి అని చూడకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారా లేదా ? అని చూసి బహుళ సంతస్తులను సైతం కూల్చివేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను కూల్చివేయగా, ఓ భవన నిర్మాణ యజమాని ఎంత వేడుకున్నా అధికారులు ఒప్పుకోలేదు. గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ చిలుకూరు, అప్పోజిగూడ గ్రామ పంచాయతీ రెవెన్యూను ఆనుకుని ఉంటుంది. ఓ రియల్ వ్యాపారి గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్‌ను కలుపుకొని వెస్ట్ సైడ్ అనే వెంచర్‌ను చేయగా, కొందరు బడా బాబులు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్లు కొనుగోలు చేసి దర్జాగా లేక్ వ్యూవ్‌తో పాటు గచ్చిబౌలి, ఫైనాన్సియల్ జిల్లా భవన అంతస్తుల వ్యూ కనిపించేలా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సప్లయ్ డిపార్ట్‌మెంట్, సివరేజ్ బోర్డు అధికారులతో పాటు ఇరిగేషన్ అధికారులు గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎన్ని నిర్మాణాలు చేపట్టారని సర్వే చేయగా అప్పోజిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో మూడు భవనాలు, చిలుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఒక భవనాన్ని నిర్మించినట్లుగా గుర్తించారు. ఆ రెండు శాఖల అధికారులు పూర్తి స్థాయిలో నివేదికను హైడ్రాకు నివేదించగా హైడ్రా ఆదివారం ఉదయం కూల్చివేసింది. హైడ్రా అధికారులు మల్లికార్జున్, చరణ్‌తో పాటు హెచ్ఎంఎస్ఎస్‌బీ డీజీఎం నరహరి, జలమండలి విజిలెన్స్ అధికారి లక్ష్మీరెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి స్థానిక సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలోని భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అప్పోజిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు భవనాలను, చిలుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఒక నిర్మాణాన్ని కూల్చివేశారు. దేవలం వెంకటాపూర్ గ్రామ సమీపంలోని గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ ఓ అక్రమ నిర్మాణాన్ని కూడా కూల్చి వేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి సుమారుగా 10 గంటల సమయం పట్టింది. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం మంచిదేనని స్థానికులు పేర్కొంటున్నారు.



గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో..

### అడ్డుకునే ప్రయత్నం..

కోట్ల రూపాయలు పెట్టి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తుండగా యజమానులు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేయగా, అధికారులు మాత్రం లెక్క చేయలేదు. అప్పోజిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో మూడు భవనాలను సుమారుగా 5 వందల గజాల విస్తీర్ణంలో నిర్మించారు. ఒక భవనం పనులు చివరి దశలోకి రాగా, కిటికీలు, డోర్‌లు, గ్లాస్ పిట్టింగ్‌లు అవుతున్నాయి. మరో రెండు భవనాలు భారీగా నిర్మించారు. ఆ రెండు భవనాల రెండో అంతస్తులో స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించుకున్నారు. నిర్మాణ దశలో ఉపయోగించిన మెటీరియల్ కాంట్రాక్టర్‌కు సంబంధించినది కాబట్టి వాటిని ఖాళీ చేయించి కూల్చివేశారు.





మొయినాబాద్‌లోని అప్పోజిగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

### హైడ్రా చర్యలను ఆహ్వానిస్తున్నాం

- ఆదిబట్ల, శంషాబాద్, తుక్కుగూడ ప్రాంతాలపై దృష్టిపెట్టాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

రంగారెడ్డి, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ భూముల్లో చెరువులు, కుంటల్లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రా చర్యలను సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆహ్వానిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆదిబట్ల, శంషాబాద్, తుక్కుగూడ, మొయినాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాల్లో నిర్మాణ కంపెనీలు చెరువులు, కుంటలను ఆక్రమించి కట్టడాలను చేపట్టారు. వాటిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హైడ్రా చర్యల నేపథ్యంలో బెదిరింపులకు పాల్పడుతున్న రాజకీయ నాయకులను ప్రభుత్వం ఉపేక్షించరాదని కోరారు. ప్రభుత్వం హైడ్రాకు అండగా నిలబడాలని, కబ్జాకు గురైన చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల వివరాలను ఆయా ప్రాంత ప్రజలు హైడ్రాకు ఇవ్వాల్సిందిగా కోరారు. ఇప్పటికే సీపీఎం పార్టీ కొన్ని వివరాలను అందజేసిందని, మరిన్ని వివరాలను సేకరించి అందజేయనున్నట్లు తెలిపారు.